

దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో కోనసీమ విద్యార్థుల ప్రతిభ... 8లో

బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే...



రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు

యిళ్ల వెంకటేశ్వరరావు, పీడీఎఫ్ ఎమ్మెల్సీ, అమలాపురం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 1: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు. రాష్ట్రాభివృద్ధికి రావాల్సిన నిధులు లేవు. ప్రాజెక్టులు లేవు. కేంద్రంపై పోరాడతామన్న సీఎం జగన్ మాట తప్పి మడమ తిప్పేసారు. 25లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే వాటి భర్తీకి ఏ విధమైన చర్యలు తీసుకోలేదు. వ్యవసాయం, ఎరువులు, ఆహారం, మహిళలకు సంబంధించిన సబ్సిడీలను పూర్తిగా తగ్గించేశారు. సాధారణ ప్రజలు ప్రయాణం చేసే ప్యాసింజర్ రైళ్లను తగ్గించి వందే భారత్ రైళ్లను పెంచడం వల్ల పేదలకు తీరని నష్టం జరుగుతుంది.

జిల్లాకు అన్యాయం

కారెం వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కన్వీనర్, అమలాపురం



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి, జిల్లాకు తీరని నష్టం జరిగింది. కోనసీమ రైల్వే లైన్‌కు బడ్జెట్‌లో అరకొర నిధులు మాత్రమే కేటాయించారు. కొబ్బరి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని ఏళ్ల తరబడి డిమాండు ఉన్నప్పటికీ ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడం శోచనీయం. పోలవరం నిర్వాసితులకు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, అమరావతి రాజధానికి నిధుల కేటాయింపు వంటివి చేయకపోవడం అన్యాయం.

రైల్వే లైన్‌కు రూ.300 కోట్లు కేటాయింపుపై హర్షం



డాక్టర్ ఇఆర్ సుబ్రహ్మణ్యం, కోనసీమ రైల్వే సాధన సమితి కన్వీనర్, అమలాపురం

2024-25 కేంద్ర బడ్జెట్‌లో కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌కు రూ.300 కోట్లు కేటాయించారు. స్థల సేకరణ పూర్తిచేసి పనులు వేగవంతం చేసేలా కేంద్రం చర్యలు తీసుకోవాలి.

అంకెల గారడీ



కామన ప్రభాకరరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు

బడ్జెట్ అంకెల గారడీలా ఉంది. సామాన్య, మధ్య తరగతి ప్రజల నడ్డి విరాచేలా ఉంది. ఏపీ రాజధానికి కానీ, ప్రాజెక్టులకు కానీ నిధులు కేటాయించకపోగా గ్యాస్ ధర పెంచడం దారుణం.

పరిశోధన, సృజనాత్మక రంగాలకు లక్ష కోట్లు శుభపరిణామం



పట్నాల బాలాజీ, వ్యాపారి, ద్రాక్షారామ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 1: ఇతర దేశాలతో పోల్చుకుంటే భారత్‌లో పరిశోధన, సృజనాత్మక రంగాలకు ప్రోత్సాహం అంతగా లేక నిపుణులు ఇతర దేశాలకు వలస వెళ్తున్నారు. లక్ష కోట్లతో నిధి ఏర్పాటు చేస్తామని ఆర్థిక శాఖ మంత్రి చేసిన ప్రకటన శుభపరిణామం. తద్వారా దేశంలో ఎంతో మంది మేధావులు పరిశోధనలు చేసి సృజనాత్మకతతో ఎన్నో అద్భుతాలు సృష్టించగలుగుతారు. ఉత్పత్తి, ఉపాధి రంగాలకు నెలవుగా మారుతుంది.

దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి



కాలాబత్తుల చిన్నారి, బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి

ఆత్రేయపురం: ఈ బడ్జెట్‌తో దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందనుంది. సోలార్ ఎనర్జీతో సోలార్ వెలుగులు, పేదలకు రెండు కోట్ల ఇళ్ల నిర్మాణం, రాష్ట్రాలకు రూ.75 కోట్ల రుణాలు అందిస్తామని ప్రకటించారు. వీటితో ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

మధ్యంతర గేలం!



పార్లమెంట్ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ కేంద్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్ మధ్యతరగతి, పేదలపై దృష్టి పెట్టింది. సామాన్యుల ఓట్లను ఆకర్షించడమే లక్ష్యంగా అడుగులు వేసింది. సొంతింటి కలను నెరవేర్చుకోవాలనే బడుగు జీవుల ఆశలపై ఓట్ల వల విసిరింది. రైతులు, మహిళలకు పెద్దగా ఖర్చులేని వరాలు ప్రకటించి ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. విద్యుత్ బిల్లుల భారంతో చితికిపోతున్న పేదలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేలా రూఫ్‌టాప్ సోలారైజేషన్ స్కీం ప్రకటించి వారికి దగ్గరయ్యే ప్రయత్నం చేసింది. పన్నుల విధానంలో ఏమార్పు చేపట్టకుండా వేతనజీవిని ఉసూరుమనిపించింది. కొత్త విధానంలో రూ.7 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉండగా, దాన్ని రూ.8 లక్షలకు పెంచుతారని ప్రచారం జరిగినా కరుణించలేదు. అటు పీఎం కిసాన్ సాయాన్ని రూ.8 వేలకు పెంచుతారని లీకులిచ్చినా బడ్జెట్‌లో ఆ ఊసే లేదు. వెరసి పలురకాల ఆకర్షణలతో ఓట్లను రాబట్టుకోవడమే లక్ష్యంగా నిర్మలమ్మ పద్దు మమ అనిపించింది.

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/ అమలాపురం (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఓట్ల ఆకర్షణే లక్ష్యంగా సాగిన తాత్కాలిక బడ్జెట్‌లో మధ్యతరగతికి కేంద్రం తీపికబురు అందించింది. వీరికి ఇళ్ల కొనుగోలు, సొంతంటి నిర్మాణం కోసం కొత్త హౌసింగ్ స్కీం ప్రకటించింది. బస్తీలతో పాటు అద్దె ఇళ్లల్లో ఉన్న వారికి సొంతింటి కల నిజం చేస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో సొంతింటి కల తీరబోతుందనే ఆశ పేద, మధ్య తరగతి వర్గాల్లో పెరిగింది. అయితే ఈ పథకం కింద బ్యాంకు లోన్లకు సంబంధించి రాయితీలను కేంద్రం అందించనుంది. ఈ పథకానికి సంబంధించి మార్గదర్శకాలు విడుదలైతే ఎవరు అర్హులవుతారనేదానిపై మరింత స్పష్టత రానుంది. అయితే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రాలైన కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంతో పాటు పలు మునిసిపాలిటీల పరిధిలోని పట్టణాల్లో వేలాది మంది సొంతిళ్లు లేక అద్దె ఇళ్లల్లో నివసిస్తున్నారు. కేంద్రం ప్రకటించిన ఈ పథకంతో వారికి మరింత లబ్ధి కలగనుంది. మరో పక్క రాబోయే ఐదేళ్లలో పీఎం ఆవాస్ యోజన కింద రెండు కోట్ల ఇళ్లు కట్టిస్తామని కేంద్రం ప్రకటించింది.

- విద్యుత్ బిల్లుల నుంచి సామాన్యులకు విముక్తి కలిగించేలా బడ్జెట్‌లో కేంద్రం నూతన పథకం ప్రకటించింది. నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేలా రూఫ్‌టాప్ సోలారైజేషన్ పథకాన్ని ప్రవేశపెట్టనుంది. దీనివల్ల గృహ వినియోగదారులకు ఏటా రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు ఆదా అవుతుందని ప్రకటించింది.
- పాడి రైతులకు సంబంధించి పశువుల్లో పాల దిగుబడి పెంచడానికి కొత్త పథకాన్ని కేంద్రం ప్రకటించింది. పాల దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉంది. మరోపక్క ఆక్వా దిగుబడిని హెక్టారుకు మూడు టన్నుల నుంచి ఐదు టన్నులకు పెంచేవిధంగా చర్యలు చేపడతామని కేంద్రం ప్రకటించింది.
- అలాగే అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరిస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం కొత్త ఆశలు రేపుతోంది.

పర్యాటకంపై ఆశలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంటేనే పర్యాటక రంగానికి ప్రసిద్ధి. అటు ఆధ్యాత్మిక టూరిజం, ఇటు రివర్, ఎకో టూరిజం, ఇంకోవైపు బీచ్ టూరిజంపరంగా అద్భుతమైన పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. అయితే అభివృద్ధి మాత్రం అంతగా లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. కేంద్రం కొత్త బడ్జెట్‌లో పర్యాటక రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపింది. పర్యాటక రంగ అభివృద్ధి, అక్కడ అందే సేవల ఆధారంగా ఈ పర్యాటక కేంద్రాలకు రేటింగ్ ఇవ్వాలని నిర్ణయించింది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి దామాషా పద్ధతిన ఆ కేంద్రాల అభివృద్ధికి వడ్డీ రహిత రుణాలందించాలని భావిస్తున్నట్టు బడ్జెట్‌లో ఉదహరించారు.ఇదే అమల్లోకి తెస్తే కోట్లాది రూపాయలు ఆయా పర్యాటక ప్రాజె క్టుల కోసం ఖర్చు చేసే అవకాశం ఉంది. కచ్చితంగా ఏపీకి వచ్చేసరికి ఉమ్మడి తూర్పు గోదావరికి ప్రయోజనం చేకూరుతుందని జిల్లావాసులు భావిస్తున్నారు.

నిరాశాజనకంగా కేంద్ర బడ్జెట్: ఎ.నాగార్జున, కట్టుంగ, ఆత్రేయపురం మండలం



ఆత్రేయపురం: పేదలకు, మధ్య తరగతి వర్గాలకు ఏ విధమైన ప్రయోజనం చేకూరదు. నిత్యావసర సరుకుల ధరలు, నిరుద్యోగ సమస్యలపై దృష్టిసారించలేదు. ఉన్నత వర్గాలకు ప్రయోజనం చేకూర్చేలా వుంది. పేదరికం పెరిగి ఆర్థిక అసమానతలకు దారితీస్తుంది.

వేతనజీవికి రిక్తహస్తం..

ఏటా కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు ఎంతోకొంత ఊరట ఉంటుందని భావించడం, చివరకు భంగపాటుకు గురవడం షరా మామూలుగా మారింది. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓట్ల ఆకర్షణే ధ్యేయంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు ఎంతోకొంత ఆదాయపు పన్ను తగ్గింపును కేంద్రం ప్రకటిస్తుందని అంతా భావించారు. ఈ మేరకు లీకులు కూడా వెలువడ్డాయి. కానీ ఎప్పటిలాగే నిర్మలమ్మ బడ్జెట్ వేతన జీవులకు ఊరట కల్పించలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన ఈ తాత్కాలిక బడ్జెట్‌లో పన్ను విధానాల్లో ఎలాంటి మార్పుల జోలికి వెళ్లలేదు. కొత్త విధానంలో ఉన్న పన్నుదారులకు రూ.7 లక్షల వరకు ఎలాంటి పన్ను ఉండదని మాత్రం చెప్పారు. వాస్తవానికి దీన్ని ఈ మధ్యంతర బడ్జెట్‌లో రూ.8 లక్షలకు పెంచుతారని భావించినా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. దీంతో వీరందరికీ నిరాశే మిగిలింది. వాస్తవానికి జిల్లాలో సచివాలయ ఉద్యోగులతో కలిపి మొత్తం 23 వేల మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో వార్షిక ఆదాయం రూ.7 లక్షలు, ఆపై కొంచెం దాటిన వారు సగం మంది వరకు ఉన్నారు. కేంద్రం గనుక ఈ పరిమితిని రూ.8 లక్షల వరకు పెంచి ఉంటే వీరందరికి భారీ ఊరట లభించేది. కానీ నిర్మలమ్మ పద్దు వీరందరినీ ఉసూరుమని పించింది. స్లాబ్‌ల విధానాన్ని మాత్రం కుదించారు.

- పార్లమెంట్ ఎన్నికల ముంగిట మధ్య తరగతి జీవులపై కేంద్ర బడ్జెట్ ఆశల వల
- అద్దె ఇళ్లల్లో నివసిస్తున్న వారికి సొంత ఇళ్లు కొనుగోలు, నిర్మాణానికి కొత్త పథకం
- పేదలకు విద్యుత్ బిల్లుల భారం నుంచి విముక్తికి రూఫ్‌టాప్ సోలారైజేషన్ స్కీం
- వేతనజీవికి పూర్తిగా నిరాశే
- అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణ ప్రకటనతో జిల్లాలో అనేక కేంద్రాలకు మోక్షం

'పోలవరం' మాటేమిటి?

కేంద్ర బడ్జెట్‌లో ఈసారి కూడా పోలవరానికి ప్రత్యేక నిధులు కేటాయించిన దాఖలాలు ఇప్పటివరకు లేవు. ఆర్‌అండ్‌ఆర్ పూర్తిస్థాయిలో అమలుచేయడం గాని, ప్రాజెక్టును పూర్తి చేయడానికి గాని కేంద్రం ఇచ్చే నిధులే ప్రధాన ఆధారం. ఇది మధ్యంతర బడ్జెట్ అయినప్పటికీ ఈ ప్రాజెక్టుకు ఎన్నికల నేపథ్యంలోనైనా న్యాయం జరుగుతుందని రైతులు ఆశించారు. ఆ దిశగా నిధుల కేటాయింపు జరిగినట్టు లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న జేసీ నుపూర్‌అజయ్

భూహక్కు పత్రాల పంపిణీకి సన్నద్ధం కావాలి

» జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్

అమలాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రక్రియలు పూర్తిచేసి భూహక్కు పత్రాల పంపిణీకి సన్నద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షా రీ సర్వే మూడో దశ అన్ని ప్రక్రియలు పూర్తిచేసి భూహక్కు పత్రాలు పంపిణీ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిత్యావసరాలను లక్ష్యాల మేరకు అందించాలన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా వేతన జీవులకు పనులు కల్పించడంతో పాటు తద్వారా సమకూరిన మెటీరియల్ కాంపోనెంట్‌తో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. బాల్య వివాహాల నిరోధంపై సమీక్షించారు. బాల్య వివాహాల నిర్మూలనలో అలసత్వం ప్రదర్శించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని, కన్వీనర్లుగా ఎంపీడీవోలు వ్యవహరిస్తారని తెలిపారు. సమావేశంలో డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, సీపీవో వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీపీవో వి.కృష్ణకుమారి, డీఈవో ఎం.కమలకుమారి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కిమ్స్ క్రీడా ప్రాంగణంలో ఈదరపల్లి జట్టు సభ్యులతో మాట్లాడుతున్న తాలూకా ఎస్ఐ శేఖర్‌బాబు

'ఆడుదాం ఆంధ్రా' పోటీల్లో వివాదం

» నిరసనకు దిగిన ఈదరపల్లి జట్టు

» క్రికెట్ పోటీలను వాయిదా వేసిన అధికారులు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 1: ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రికెట్ పోటీల నిర్వహణలో తలెత్తిన వివాదంతో ఈదరపల్లి జట్టు నిరసనకు దిగి పిచ్‌పై బైఠాయించింది. ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను రెండో రోజైన గురువారం కిమ్స్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. సచివాలయం, మండల, నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చాయి. ఈదరపల్లి జట్టుతో రాజోలుకు చెందిన పొన్నమండ జట్టు తలపడాల్సి ఉంది. అయితే ఈదరపల్లి జట్టులో ఇతర ప్రాంతాలకు చెందిన క్రీడాకారులను చేర్చుకున్నారని రాజోలు జట్టు జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో నిర్వహణ అధికారులు ఈదరపల్లి జట్టును డిస్క్వాలిఫై చేస్తున్నట్టు ప్రకటించి మండపేట జట్టుతో రాజోలు జట్టు పోటీకి సిద్ధపడ్డారు. తాము నిబంధనల మేరకే క్రీడాకారుల పేర్లు నమోదు చేయించుకుని ఈ పోటీలకు దిగామని ఈదరపల్లి జట్టు పిచ్‌పై బైఠాయించింది. సమాచారం అందుకున్న తాలూకా సీఐ పి.వీరబాబు, ఎస్ఐ వై.శేఖర్‌బాబు, తహసీల్దారు పరమట శ్రీపల్లవి అక్కడకు చేరుకున్నారు. క్రీడాకారులతో చాలాసేపు చర్చలు జరిపారు. తమను ఏవిధంగా డిస్క్వాలిఫై చేస్తారని ప్రశ్నించారు. ఆడుదాం ఆంధ్రా నిబంధనల మేరకు గత ఏడాది డిసెంబరు 22న ఆన్‌లైన్‌లో తాము పేర్లు నమోదు చేయించుకున్నామని అధికారులకు వివరించారు. మాతో పాటు ఇతర జిల్లాల్లో ఇదే విధంగా జట్ల కూర్పు జరిగిందని గుర్తు చేశారు. వివాదం అంతకంతకూ ముదురుతుండడంతో క్రికెట్ పోటీలను వాయిదా వేస్తున్నట్టు డీఎస్డీవో పీఎస్ సురేష్‌కుమార్, క్రీడా ఇన్‌చార్జి ప్రకటించారు. ఈ వ్యవహారం జిల్లాస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. శుక్రవారం క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని రాత్రి ఏడు గంటల సమయంలో అధికారులు ప్రకటించారు. ఈదరపల్లి జట్టు వాదనలు విన్న అధికారులు ఆ జట్టు పోటీలో ఉందని ప్రకటించారు.

అమలాపురం డీఎస్పీ అంబికాప్రసాద్ బదిలీ



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 1: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్‌ను రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో అనకాపల్లి దిశ డీఎస్పీ ఎం.మహేశ్వరరావును నియమించారు. మరో మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. అమలాపురం దిశ డీఎస్పీ సుంకర మురళీమోహన్‌ను మైలవరం డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో విశాఖపట్నం సీఎస్‌బీ డీఎస్పీ వై.గోవిందరావును నియమించారు.



డీఆర్డీఏ పీడీ శివశంకరప్రసాద్‌కు లేఖ అందజేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

సెర్ప్ ఉద్యోగుల సమ్మె విరమణ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 1: కలెక్టర్ కార్యాలయం వద్ద తొమ్మిది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు గురువారం విరమించారు. బుధవారం రాత్రి రాష్ట్ర సెర్ప్ ఉద్యోగుల సంఘ నాయకులతో ప్రభుత్వ ప్రతినిధులు జరిపిన చర్చల కారణంగా సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్టుసంఘ జిల్లా నాయకులు డి.వరాలబాబు, ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, కేవీవీ ప్రసాద్ తెలిపారు. గురువారం నుంచి విధులకు హాజరవుతామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్‌ను కలిసి లేఖ అందజేశారు. సమ్మెకు సహకరించిన ప్రజా సంఘాల నాయకులు, వీఏవోలకు కృతజ్ఞతలు తెలిపారు.

7న ఎలుకల సామూహిక నివారణ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 1: జిల్లావ్యాప్తంగా ఈ నెల ఏడో తేదీన ఎలుకల సామూహిక నిర్మూలన కార్యక్రమం చేపట్టనున్నట్టు వ్యవసాయ శాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు వి.బోసుబాబు తెలిపారు. ముమ్మిడివరంలోని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో సామూహిక ఎలుకల నిర్మూలనపై వ్యవసాయ సంచాలకులకు, వ్యవసాయ అధికారులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్ర ం శాస్త్రవేత్త భవానీ, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు మాట్లాడుతూ ఎలుకల వల్ల వరిలో పిలకలు వచ్చే దశలో 0.4శాతం నుంచి 60 శాతం వరకు, కోత దశలో 5 నుంచి 10 శాతం వరకు నష్టం కలుగజేస్తాయన్నారు. ఖరీఫ్‌లో మిచౌంగ్ తుఫాను వల్ల ఎలుకల సంతానోత్పత్తి ఎక్కువైందని, దీని వల్ల అవి చేసే నష్టం ఎక్కువగా ఉంటుందని, నివారణకు రైతులు సామూహిక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాకు 863 కిలోల బ్రోమోడయోలిన్ మందును ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. ఈ మందును రైతులకు ఉచితంగా అందిస్తామని,వ్యవసాయ, వ్యవసాయేతర ఖాళీ భూముల్లో వినియోగించాలన్నారు. ఎర బుట్టలు, పొగపెట్టే విధానం ద్వారా కూడా ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించాల న్నారు. పొలం గట్లను శుభ్రంగా ఉంచుకున్నట్టయితే ఎలుకల ఉధృతిని తగ్గించి పంట నష్టం శాతాన్ని తగ్గించుకోవచ్చన్నారు. విషపు ఎరను 96శాతం నూకలు, 2శాతం నూనె, 2శాతం బ్రోమోడయోలిన్ మందుతో తయారు చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల నిర్వహణలో ఎలుకల సామూహిక నిర్మూలన చేపడతామన్నారు.



శిక్షణా తరగతిలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

రెండో రోజుకు యూటీఎఫ్ రిలే దీక్షలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 1: ఆర్థిక బకాయిల సాధనకై యూటీఎఫ్ దశలవారీ పోరాటంలో భాగంగా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం రెండో రోజుకు చేరాయి. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీఏఎస్ సుబ్బారావు దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. గత నాలుగేళ్లుగా ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన డీఏ, పీఆర్సీ, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండు చేశారు. ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ సొమ్ములను ప్రభుత్వం తన సొంత అవసరాలకు వాడుకుని కనీసంలోన్లు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. విద్యాశాఖలో రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 23వేల ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేవలం 6,100 పోస్టులు మాత్రమే భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వడం విచారకరమన్నారు. ఎన్నో పోరాటాలు చేసి రద్దు చేయించుకున్న అప్రంటీస్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. రెగ్యులర్ స్కేలుతోనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పి.సురేంద్రకుమార్, జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు, జిల్లా కార్యదర్శులు పెన్నాడ శ్రీనివాసరావు, ఎం.ప్రదీప్‌కుమార్, కె.శ్రీనివాసరావు, బాలాజీ, కుడుపూడి సత్యనారాయణ, కారెం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట దీక్షా శిబిరంలో కూర్చున్న యూటీఎఫ్ నాయకులు

పురాతన సంపదను సంరక్షించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజేంద్రసింగ్

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 1: కాకినాడ నగరంలోని పురాతన సంపదను, కట్టడాలను సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రామన్ మెగసెసె అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్ అన్నారు. వర్సిటీ ప్రాంగణంలో యూసీఈకే, ఐఎస్టీ విద్యార్థులతో వారసత్వ సంపద రక్షణ కోసం ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. జంగిల్ బుక్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ఓడీఎల్ డైరెక్టర్ మురళీకృష్ణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజేంద్రసింగ్ మాట్లాడుతూ రాజస్థాన్ నీటి కొరత, గంగా ప్రక్షాళన, నీటి లభ్యతను అంచనా వేయడం, జోర్డాన్ జలాలకు సంబంధించిన సిరియా సంక్షోభం, భూమిలోని నీటిని సంరక్షించడంలో విద్యార్థుల పాత్ర వివరించారు. ఐక్యరాజ్యసమితి ప్రతినిధిగా ఆరుసార్లు సిరియాను సందర్శించిన అనుభవంతో విద్యార్థులకు పలు వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఐఎస్టీ డైరెక్టర్ ఎ.గోపాలకృష్ణ, డాక్టర్ సత్యాజీరావు, సత్య, మాజీ మేయర్ సరోజ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెగుళ్లతో మిర్చి పంట మటాష్

- విలీన మండలాల్లో 90 శాతం దెబ్బతిన్న మిర్చి
- ఆశతో పంటను కాపాడుకునేందుకు అనేక ప్రయత్నాలు
- అయినా ఫలితం దక్కక పంటను పీకేస్తున్న రైతులు
- ఆ పొలాల్లో మొక్కజొన్న, పొగాకు పంటల సాగు



గన్నవరంలో మిర్చి పంటను పీకేస్తున్న కూలీలు

ఎటపాక, ఫిబ్రవరి 1 : ఆరుగాలం కష్టపడి, రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి పంట దిగుబడుల కోసం ఎదురుచూస్తున్న మిర్చి రైతుల ఆశలు ఆడియాశలయ్యాయి. గత నాలుగేళ్లుగా వరుస నష్టాలను మూటగట్టుకుని ఈ ఏడాది గంపెడాశతో మిర్చిని సాగు చేశారు. ఈ ఏడాది కూడా మిర్చి రైతుకు కాలం కలిసిరాలేదు.. ఈ ఏడాది కూడా నష్టాన్ని చవిచూసే పరిస్థితి నెలకొంది.. విలీన మండలాల్లో ఈ ఏడాది సుమారు 6 వేల ఎకరాల పైనే మిర్చి పంట సాగు చేశారు. అయితే పంట సాగు చేసిన రెండు, మూడు నెలల కాలం తర్వాత మిర్చికు తెగుళ్లు ఆశించాయి. తెగుళ్లతో పంట ఎదుగుదల నిలిచి, పూత, మొదటి దశలో ఆగిపోయింది. దాంతో తెగుళ్లు సోకిన పంటకు రైతులు అనేక రకాల మందులు పిచికారీ చేసినా, ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడ బాగున్నాయని భావించిన మిర్చి చేలకు డిసెంబరులో



గౌరిదేవిపేటలో మిర్చిపంటను పీకేసి పొగాకు సాగు చేసిన దృశ్యం

వచ్చిన తుఫాన్ మరింత దెబ్బతీసింది. తుఫాన్ దాటికి పూత రాలిపోయింది. ఇవేకాక పంటకు గతేడాది వ్యాపించిన నల్లితామర పురుగు కూడా పంటకు ఆశించడంతో మిర్చి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. దెబ్బతిన్న పంటను రైతులు వదులుకోక ఆశతో మందులు పిచికారీ చేస్తూ వచ్చారు. అదనపు పెట్టుబడులు తప్ప పంట లో ఎటువంటి మార్పు కన్పించకపోవడంతో రైతులు పంటపై చివరకు ఆశలు వదులుకుని దున్నేస్తున్నారు. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాల దిగుబడి వచ్చే మిర్చి, తెగుళ్లతో ప్రస్తుతం 2,3 క్వింటాళ్లు మాత్రమే వచ్చే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.లక్షన్నర పెట్టుబడులు పెట్టినట్లు చెబుతున్నారు. తెగుళ్లు సోకిన మూడు, నాలుగు నెలల పంటను కూడా పీకేస్తున్నారు. ఆ పొలాల్లో తిరిగి మొక్కజొన్న, పొగాకు వంటి పంటను సాగు చేస్తున్నారు.

తెగుళ్లు, నకిలీ విత్తనాలతో 3 ఎకరాల పంటను పీకేశా



ఈ ఏడాది ఐదు ఎకరాల్లో మిర్చిపంట సాగు చేశాను. ఇందులో మూడు ఎకరాల పంటకు తెగులు, నకిలీ విత్తనాలతో పంట మొత్తం దెబ్బతింది. మూడు ఎకరాలకు దాదాపు మూడున్నర లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టాను. క్వింటా దిగుబడి కూడా రాలేదు. మూడున్నర లక్షలు నష్టపోయా.. ఇక రైతులు మిర్చి సాగు చేసే పరిస్థితి ఉండదు.

● మందలపు శ్రీనివాసరావు, రైతు, గన్నవరం.

పెద్ద పులి సంచారంతో భయంభయం

- జల్లెడ పడుతున్న అధికారులు.. అయినా చిక్కని వైనం
- భయాందోళనలో వివిధ గ్రామాల ప్రజలు
- బయటకు రావద్దంటూ హెచ్చరికలు జారీ చేస్తున్న అధికారులు

గోపాలపురం, ఫిబ్రవరి 1: పెద్దపులి సంచారంతో మండలంలో ప్రజలు భయందోళనలు చెందుతున్నారు. నిన్న మొన్నటి వరకు ద్వారకా తిరుమల, నల్లజర్ల మండలాల్లోని అడవుల్లో సంచరించిన పెద్దపులి గురువారం ఉదయానికి దేవరపల్లి మండలం యాదవోలు, చిన్నాయిగూడెం గ్రామాల మధ్య సంచరించినట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారు. దీంతో పంట గ్రామాల్లో టాంటాంలు వేయించి అటవీశాఖాధికారులు ప్రజలను అప్రమత్తం చేసే పనిలో పడ్డారు. ఒక పక్క పులి సంచారాన్ని అడుగడుగునా గమనిస్తున్న అటవీ శాఖాధికారులు మరో పక్క ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో యాదవోలు రెవెన్యూ పరిధి దాటి వాదాలకుంట గ్రామ శివారులో ఉన్న గాడి చెరువు సమీపంలోని గద్దే ఈశ్వరుడుకు చెందిన పొగాకు తోటలో పెద్దపులి జాడలు కనపడటంతో రైతులు భయందోళన చెందారు. ఈ విషయం అటవీశాఖాధికారులకు తెలియడంతో పులిని జాడలను వెంబడిస్తూ సాయంత్రానికి కరిచర్లగూడెం, కోమటిగుంట గ్రామాల మధ్యలో ఉన్న మాతంగమ్మ మెట్ట వెనుక భాగంలో పెద్దపులి ఉన్నట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారు. దీంతో కరిచర్లగూడెం, కోమటిగుంట, వాదాలకుంట, వెదుళ్లకుంట, జగన్నాథపురం, కరగపాడు, బుచ్చయ్యపాలెం గ్రామాల్లో టాంటాంలు వేయించి సాయంత్రం 5 గంటలు దాటితే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దంటూ ఒంటరిగా తిరగవద్దని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఫారెస్ట్ రేంజ్ అధికారి ధర్మరాజు ఇచ్చిన వివరాల ప్రకారం గత పది రోజులుగా సంచరిస్తున్న పెద్దపులిని వెంబడిస్తున్నామని గురువారం సాయంత్రానికి కరిచర్లగూడెం, కోమటిగుంట గ్రామాల మధ్యలో ఉన్న మాతంగమ్మమెట్ట వద్దకు పెద్దపులి చేరినట్లు గుర్తించామన్నారు. తమ అంచనా ప్రకారం కరగపాడు మీదుగా పోలవరం పాపికొండల ప్రాంతానికి వెళ్లవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు.



పులి పాదముద్రలు



జాడ కోసం అమర్చిన సీసీ కెమెరా

తాడిపూడి ఇసుక ర్యాంపులో చిరుత

భయాందోళనలో స్థానికులు

తాళ్లపూడి, ఫిబ్రవరి 1: తాళ్లపూడి మండలం తాడిపూడి ఇసుక ర్యాంపులో గురువారం చిరుత పులి సంచరిస్తున్నట్లు పలువురు గుర్తించారు. గోదావరి తీరం వెంబడి నడుచుకుంటూ వెళ్లడాన్ని అక్కడ పని చేసే సిబ్బంది చూసి భయభ్రాంతులకు గురై పక్కనే ఉన్న షెడ్డులో దాక్కున్నారని తెలిపారు. దూరం నుండే నడుచుకుంటూ వెళ్లిన దృశ్యాన్ని వీడియోలో బంధించారు. చిరుత పులి తాళ్లపూడి గ్రామం వైపుగా వెళ్లిందని చెప్పడంతో గోదావరి తీర ప్రాంత వాసులు కాస్త జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. అంతేగాక జిల్లాలో తిరుగుతున్న ఈ పులుల బెడదతో ప్రజలు హడలిపోతున్నారు.

ఆటో-బైక్ ఢీ: ఇద్దరి మృతి



మాధవరావు (ఫైల్‌ఫోటో)



సంఘటన స్థలంలో మృతదేహాలు

కొత్తపేట, ఫిబ్రవరి 1: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెల శివారు చౌదరిపురం సమీపంలో గురువారం ఆటో బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలైనట్టు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ తెలిపారు. వివరాల ప్రకారం.. రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడు గ్రామానికి చెందిన చీమల మాధవరావు (43) తండ్రి నరసింహారావుతో కలిసి ద్విచక్ర వాహనంపై కొత్తపేట మండలం వాడపాలెంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో పలివెల మీదుగా ముమ్మిడివరప్పాడు బయల్దేరారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలానికి చెందిన ఆటో డ్రైవర్ బండి మోషే (35) ప్రయాణికులు లేని ఆటోతో పలివెల సమీపంలోని కూలీలను ఎక్కించుకునేందుకు వస్తున్నాడు. చౌదరిపురం సమీపంలో మాధవరావు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆటో డ్రైవర్ నేరుగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న మాధవరావు, ఆటో నడుపుతున్న మోషే అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ అక్కడకు చేరుకుని తీవ్రంగా గాయపడిన నరసింహారావును మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. మృతదేహాలను కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాధవరావు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జ్వాలాసాగర్ తెలిపారు.

పలువురు డీఎస్పీలు బదిలీలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జిల్లాలోని డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ డి.రామవర్మను అనకాపల్లి డీటీసీకి పంపించారు. నాలుగున్నరేళ్ల నుంచీ ఆయన అదే పోస్టులో కొనసాగుతున్నారు. ఆయన స్థానంలో కాకినాడలోని ఏపీఎస్పీ మూడో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ బి.అప్పారావును నియమించారు. సీఐడీ డీఎస్పీ బి.రామకృష్ణను రామచంద్రాపురం ఎస్‌డీపీవోగా, డీఎస్పీ క్రైమ్స్ జీసీ గురునాథ్‌బాబును సత్తెనపల్లి ఎస్‌డీపీవోగా, కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మను నరసారావుపేట ఎస్‌డీపీవోగా, రాజమండ్రి సౌత్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులును నార్త్ జోన్‌కి, డీసీఆర్‌బీ డీఎస్పీ ఎ.శ్రీనివాసరావును సత్యసాయి జిల్లా దిశాకు, చిత్తూరు ఎస్‌డీపీవో కె.శ్రీనివాసమూర్తిని రాజమండ్రి క్రైమ్స్ డీఎస్పీగా, సత్తెనపల్లి ఎస్‌డీపీవో బి.ఆదినారాయణను తూర్పుగోదావరి దిశా డీఎస్పీగా బదిలీ చేశారు. రాజమండ్రి రైల్వే పోలీస్ డీఎస్పీ (డీఎస్ఆర్‌పీ), టీవీఎస్ నాగేశ్వరరావు విజయవాడ డీఎస్ఆర్‌పీగా వెళ్లగా ఆయన స్థానంలో డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ఎల్.మోహన్‌రావును నియమించారు.

ఇకపై అమృత్‌భారత్ స్టేషన్ పనులు వేగవంతం

సామర్లకోట, ఫిబ్రవరి 1: కేంద్ర బడ్జెట్‌లో విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని కాకినాడ, తుని, నిడదవోలు రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి. బడ్జెట్‌లో అమృత్‌భారత్ స్టేషన్లకు మరిన్ని నిధులు కేటాయించడంతో పనులు పరుగులు పెట్టనున్నాయి. గత ఏడాది ఆగస్టు 6న వర్చువల్ విధానంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ భూమి పూజలు ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులో కాకినాడకు రూ.11.50 కోట్లు, తుని స్టేషన్‌కు రూ.9.50 కోట్లు నిధుల కేటాయింపులు జరగగా శుక్రవారం నాటి బడ్జెట్ కేటాయింపులలో అమృత్‌భారత్ స్టేషన్ల అభివృద్ధికి సంబంధించి నిధుల విడుదలకు లైన్‌క్లియర్ అయ్యింది. తూర్పుగోదావరి జిల్లాలోని నిడదవోలుకు రూ. 19.33 కోట్లు విడుదల కానున్నట్లు రైల్వే ఉన్నతాధికారి గురువారం రాత్రి చెప్పారు. ఇవి గాకుండా విజయవాడ డివిజన్ పరిధిలో మరో 8 రైల్వే స్టేషన్లకు అమృత్‌భారత్ పథకంలో నిధులు విడుదల కానున్నాయి. అలాగే విజయవాడ-విశాఖ మధ్య మూడో ట్రాక్ పనులు గురువారం నాటి బడ్జెట్ నిధుల కేటాయింపులతో మరింత వేగవంతం కానున్నాయి. చిరకాల వాంఛగా ఉన్న మూడో ట్రాక్ పనులు ఇప్పటికే చెన్నై నుంచి గుంటూరు వరకూ దాదాపు పూర్తయినట్లు సమాచారం. గత ఏడాది రైల్వే జీఎం సైతం సామర్లకోట నుంచి ఇటు విశాఖకు, అటు విజయవాడ మధ్య మూడో ట్రాక్ ఏర్పాటుకు ప్రస్తుత ట్రాక్ సామర్థ్యాన్ని సైతం విండో సీయింగ్ ద్వారా పరిశీలించిన విషయం విదితమే. తాజాగా గురువారం నాటి రైల్వే బడ్జెట్‌లో మూడో ట్రాక్ పూర్తికి కూడా నిధుల కేటాయింపులు జరగగలవని రైల్వే అధికారులు చెప్పారు. కాగా ఆంధ్రా-తెలంగాణా మధ్య దూరాన్ని మరింత దగ్గర చేసేందుకు కొవ్వూరు-భద్రాచలం మధ్య నూతన రైల్వే లైన్ నిర్మాణానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు జరుగుతాయని కొండంత ఆశతో ఎదురుచూపులు చూసిన ఈ ప్రాంత ప్రయాణికులు బడ్జెట్‌లో దీనిపై ఏమాత్రం ప్రస్తావించకపోవడం పట్ల తీవ్ర నిరాశ చెందాల్సి వచ్చిందని జడ్ఆర్‌యూసీసీ సభ్యుడు యార్లగడ్డ దశరథ రామారావు చెప్పారు.

ఉత్తుత్తి డీఎస్సీలెందుకు?

ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రినాథ్‌బాబు

రాజానగరంలో ఎస్టీయూ నిరసన ప్రదర్శన

రాజానగరం, ఫిబ్రవరి 1 : ప్రభుత్వం ఇన్ని రోజులూ మెగా డీఎస్సీ అని ఊదరగొట్టి ఇప్పుడు కేవలం ఆరువేల పోస్టులతో ఉత్తుత్తి డీఎస్సీ నిర్వహించాలనుకోవడం నిరుద్యోగులను దగా చేయడమేనని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.జె.త్రినాథ్‌బాబు ఆరోపించారు. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల పట్ల ఆయన నిరసన వ్యక్తం చేస్తూ ఎస్టీయూ ఆధ్వర్యంలో రాజానగరంలోని గాంధీ విగ్రహం వద్ద సంఘ సభ్యులతో కలిసి కొవ్వొత్తులు, ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా 50 వేల పోస్టులకు డీఎస్సీ నిర్వహిస్తామని ఊదర గొట్టిన ప్రభుత్వం కేవలం 6 వేలు పోస్టులతో డీఎస్సీ నిర్వహిస్తామని ఉసూరుమనిపించడం సరికాదన్నారు. ఉపాధ్యాయ సంఘాలు దశాబ్దాల తరబడి పోరాటం సాగించి రద్దు చేయించిన అప్రంటీస్ విధానాన్ని మళ్లీ తెరపైకి తీసుకురావడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు సంబంధించి పునరాలోచన చేయకపోవడం విచారకరమన్నారు. వేతన సవరణ కమిటీ ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా ప్రయోజనం లేదని, కనీసం మధ్యంతర భృతిపై చర్చించకపోవడం ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలపై ప్రభుత్వ నిర్లక్ష వైఖరికి నిదర్శనమని ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు బండి ధర్మరాజు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఆర్థిక కార్యదర్శి వీరబాబు, జిల్లా నాయకులు భీమేశ్వరరావు, శైలజ, మండల నాయకులు చిన్నా మాస్టారు, గీత, వీరబాబు, ఉదయభాను, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ సైన్స్‌ఫెయిర్‌లో ప్రత్యేక బహుమతి



చైతన్యకు ప్రత్యేక బహుమతి అందిస్తున్న దృశ్యం

బిక్కవోలు, ఫిబ్రవరి 1: విజయవాడలో జరిగిన సౌత్‌జోన్ సైన్స్ ఫెయిర్‌లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొన్న తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాక ఉన్నత పాఠశాలకు చెందిన కెఎల్ఎస్ చైతన్య ప్రత్యేక బహుమతి గెల్చుకున్నాడని హెచ్ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివిధ రాష్ట్రాలు పాల్గొన్న ఈ సైన్స్ ఫెయిర్‌లో చైతన్య లైఫ్ సేవింగ్ లోకాస్ట్ వెంటిలేటర్‌ను ప్రదర్శించి ఎస్ఈఆర్‌టీ డైరెక్టర్ పి.ప్రతాపరెడ్డి, ఎండీఎం డైరెక్టర్ షోభికా, ఆర్‌జేడీ నాగమణి నుంచి ప్రత్యేక బహుమతి తీసుకున్నాడన్నారు. ఈ సందర్భంగా చైతన్యను, గైడ్ టీచర్ శ్రీనివాసుల రెడ్డిని పలువురు అభినందించారు.

ఖాతాల్లో డబ్బులు మాయమవుతున్నాయి

బయోమెట్రిక్, ఈకేవైసీ అనంతరం సొమ్ములు ఆటోమేటిక్‌గా మాయం

లబోదిబోమంటూ బ్యాంకులకు పరుగులు తీసిన ఖాతాదారులు



పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

రావులపాలెం, ఫిబ్రవరి 1: గ్రామాల్లో కులగణన పేరిట సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టారు. ఆ సమయంలో బయోమెట్రిక్‌తో వేలిముద్రలను తీసుకుంటున్నారు. అయితే అనంతరం బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు మాయమవుతున్నాయని పలువురు ఖాతాదారులు వాపోతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలంలో ఇలా బ్యాంకు ఖాతాల్లో సొమ్ము మాయంపై బాధితులు బ్యాంకు అధికారులు, పోలీసులను ఆశ్రయిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కులగణన సర్వేకు సంబంధించి వేలిముద్ర వేసిన అనంతరం కొందరికి పది నిమిషాలు, కొందరికి రోజు వ్యవధిలో వారి ఖాతాల్లో నగదు మాయవవుతుండడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ-కేవైసీ చేసిన అనంతరం కూడా బ్యాంకు ఖాతాల్లోని నగదు వారి ప్రమేయం లేకుండానే మాయమవుతోంది. బాధితులు బ్యాంకులకు వెళ్లి అధికారులను అడుగుతున్నారు. మీరు ఎక్కడైనా బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు వేశారా అని వారు తిరిగి ప్రశ్నిస్తున్నారు. కులగణనకు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈకేవైసీ సమయంలోను బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు వేశామని బాధితులు తెలిపారు. ఇది సైబర్ క్రైమ్ అని... దీనిపై పోలీసులను ఆశ్రయించమని బ్యాంకు అధికారులు సూచించారు. ఇప్పటి వరకు మొబైల్‌కు నగదు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఇదంతా చూస్తే బాధితులు వందల సంఖ్యలో ఉన్నట్టు సమాచారం. మండల పరిధిలోని పొడగట్లపల్లి, ఈతకోటల్లో కులగణన పేరిట వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సర్వే నిర్వహించారు. అనంతరం ఐదు గంటల వ్యవధిలో రూ.9,900, రూ.5 వేలు, రూ.1,300, రూ.1,300 నగదు వారి ఖాతాల నుంచి మాయమైంది. రావులపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ-కేవైసీ అనంతరం తమ ఖాతాల్లో రూ.5వేలు, రూ.9,900 చొప్పున నగదు మాయమైందని సుమారు ఐదుగురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొడగట్లపల్లికి చెందిన పోలవరపు శ్రీనివాస్, ఈతకోటకు చెందిన మానే ప్రసాద్ మరి కొందరు బాధితులతో కలిసి తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వం వలంటీరు వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రతి పథకానికీ వేలిముద్రలు తీసుకుంటోంది. వ్యక్తిగత సమాచారాన్ని బట్టబయలు చేస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. వేలిముద్రలు తీసుకోకుండా కులగణన సర్వే నిర్వహించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

‘ఆదిత్య’లో అంతర్జాతీయ సదస్సు

గండేపల్లి, ఫిబ్రవరి 1: సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 2, 3 తేదీల్లో ఇంజనీరింగ్ అనువర్తనాల అల్గారిథమ్‌లు, గణన సిద్ధాంతం అనే అంశం మీద ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ జరుగుతుంది. వివిధ దేశాలకు, రాష్ట్రాలకు చెందిన అనేక మంది అభ్యర్థులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనబోతున్నారు. మొదటి రోజు ఉదయం కాన్ఫరెన్స్‌లో జేఎన్టీయూకే సీఎస్ఈ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం.హెచ్ఎం కృష్ణప్రసాద్ ముఖ్య ఉపన్యాసకులుగా, మధ్యాహ్నం ఎన్ఐటీ పుదుచ్చేరిలో సీఎస్సీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సురేంద్రన్ ముఖ్య ఉపన్యాసకులుగా పాల్గొనబోతున్నారు. రెండో రోజు కాన్ఫరెన్స్‌లో ముఖ్య ఉపన్యాసకులుగా మలేషియాలో యూనివర్సిటీ టెక్నాలజీ పెట్రోనస్‌లో ఈఈఈ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఇరైవన్ ఇలాం వరుతీ పాల్గొంటున్నారని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

పురోహితులు బ్యాట్ పట్టారు





క్రికెట్ ఆడుతున్న పురోహితులు

అంబాజీపేట, ఫిబ్రవరి 1: నిత్యం పూజలతో బీజీగా ఉండే పురోహితులు క్రికెట్ ఆడారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట జడ్పీ హైస్కూల్‌లో గురువారం పంచెకట్టులో పురోహితులు సిక్సులు, ఫోర్లు బాదారు. రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం హోరాహోరీగా జరిగింది. క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లో రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన 8 టీమ్స్ పాల్గొన్నాయి. నాలుగు జట్లు విజేతగా నిలిచాయని టోర్నీ నిర్వాహకులు తెలిపారు. ఖమ్మం, కాకినాడ, విజయవాడ, కొవ్వూరు క్రికెట్ జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. శుక్రవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఎంపీడీవోలకు మండలాల కేటాయింపు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 1: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలువురు ఎంపీడీవోలను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు విశాఖ జిల్లా నుంచి 18 మందిని, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 13 మందిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ చేయగా మొత్తం 31 మంది ఎంపీడీవోలకు మండలాలు కేటాయిస్తూ జిల్లా పరిషత్ సీఈవో ఎ.రమణారెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా విశాఖ జిల్లా నుంచి వచ్చిన ఎంపీ సువర్ణరాజు (దేవీపట్నం), వీవీ రవికుమార్ (అనపర్తి), వి.హేమసుందరావు (కోరుకొండ), కె.వసంత (గోకవరం), వి.విజయలక్ష్మి (బిక్కవోలు), మేరీ జోసీ (ఆలమూరు), కేవీ నరసింహారావు (ముమ్మిడివరం), ఎన్వీ రామచంద్రమూర్తి (రామచంద్రపురం), ఎం.విజయకుమార్ (శంఖవరం), ఎ.జయప్రకాశరావు (గొల్లప్రోలు), ఎస్‌డీ శ్యామ్ సుందర్ (సామర్లకోట), ఎస్.డేవిడ్‌రాజు (ప్రత్తిపాడు), ఎస్.జయమాధవి (కోటనందూరు), ఎస్.హనుమంతరావు (గండేపల్లి), కె.ప్రభాకరరావు(తాళ్లరేవు), బి.రమేష్ నాయుడు (కాకినాడ రూరల్), పి.ఆశాజ్యోతి (పెదపూడి), ఎం.ఉషారాణి (పెద్దాపురం) ఎంపీడీవోలుగా నియమితులయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి వచ్చిన ఎం.మురళీకృష్ణ (ఎటపాక), జీపీకేఎస్‌వీ జ్యోతిర్మయి (రాజానగరం), జీఆర్ మనోజ్ (కడియం), కేఆర్ఎస్ కృష్ణప్రసాద్ (సీతానగరం), కె.శ్రీదేవి (కాట్రేనికోన), ఎస్.వేణుగోపాలరెడ్డి(మామిడికుదురు), ఎస్.వెంకటేశ్వరరావు (ఆత్రేయపురం), కె.వాణి(కొత్తపేట), ఎండీ అమిలు జమాహ్ (ఐ.పోలవరం), కె.వెంకటలక్ష్మి (రాయవరం), సీహెచ్ త్రిశూల (పి.గన్నవరం), ఎ.శ్రీనివాస్ (రావులపాలెం), టి.సూర్యనారాయణమూర్తి (అయినవిల్లి) ఎంపీడీవోలుగా నియమించారు.

జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

టీడీపీ-జనసేన కూటమికి 140 అసెంబ్లీ సీట్లు: చిన్నయ్యదొర



బర్కత్‌పుర, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందని ఉమ్మడి ఏపీ మునిసిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ చైర్మన్ గొరకపూడి చిన్నయ్యదొర అన్నారు. జగన్ మాటలు నమ్మి అన్ని వర్గాల ప్రజలు నష్టపోయారని వచ్చే ఎన్నికల్లో వైసీపీని భూస్థాపితం చేయడమే లక్ష్యంగా ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో చిన్నయ్యదొర విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ జనసేన కూటమికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందని వచ్చే ఎన్నికల్లో 140 అసెంబ్లీ సీట్లు సాధించి ఈ కూటమి అధికారంలోకి రాబోతోందని దీనిని ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు. కోటి యాభై లక్షల మందికి సంక్షేమ పథకాలు అందించామని సీఎం జగన్ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ధరల పెరుగుదలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. చంద్రబాబును అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడే జగన్ రాజకీయ కుట్రకోణం బయటపడిందని దీనిని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారని చిన్నయ్యదొర తెలిపారు.

ఓటు వేయాలంటే ఎంతో కష్టం!



ఇలా రావాల్సిందే..

మోతుగూడెం, ఫిబ్రవరి1: అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న చదలవాడ గ్రామ పంచాయతీ పరిధిలో అతి మారుమూల గ్రామమైన ఏరువాడ గ్రామస్థులు ఓటు వేయాలంటే పెద్ద పెద్ద వాగులు, వంకలు ఎతైన గుట్టలు దాటి రావాల్సిందే. ఏరువాడ గ్రామంలో 106 మంది నివసిస్తున్నారు. ఈ గ్రామంలో 45 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా చదలవాడ తులసిపాక వచ్చి ఓటు వేయాలి. సుమారు 11 కిలోమీటర్లు దూరం దట్టమైన అడవిమార్గం ద్వారానే వాగులు దాటి వచ్చి ఓటు వేయాల్సి ఉంది. ప్రతి ఎన్నికల సమయంలో అక్కడ ఓటర్లు ఇలా వచ్చి ఓట్లు వేస్తున్నారు. ఈ సారైనా గ్రామస్థుల కష్టాలు తీర్చేందుకు ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు కోసం గ్రామస్థుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 1: ఆర్అండ్‌బీ రహదారిని ఆధునికీకరించాలంటూ జనం రోడ్డెక్కారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలో ఓఎన్జీసీ చమురు ట్యాంకర్లను అడ్డుకుని ఆందోళనకు దిగారు. అమలాపురం-ఎస్.యానాం రహదారి నిర్వహణ బాధ్యత రవ్వ, ఓఎన్జీసీ జాయింట్ వెంచర్‌దేనన్న సంగతి తెలిసిందే. కేజీ బేసిన్ పరిధిలోని ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల చమురు బావుల నుంచి ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం అన్‌లోడింగ్ పాయింట్‌కు రోడ్డు మార్గంలో ట్యాంకర్ల ద్వారా ముడి చమురు రవాణా జరుగుతోంది. ఈ కారణంగా ఆర్అండ్‌బీ రహదారి తరచూ గోతులు పడి శిథిలావస్థకు చేరడం సాధారణమై పోయింది. గతంలో స్థానిక ప్రజల ఆందోళన ఫలితంగా ఈ రహదారి నిర్వహణ బాధ్యత తమదేనని చమురు సంస్థలు ఉన్నతాధికారుల సమక్షంలో రాతపూర్వకంగా అంగీకరించాయి. అయితే ఇటీవల రహదారి గోతులమయంగా మారిందని, ఎన్నోసార్లు ఫిర్యాదు చేయగా కొంత మేర గోతులను తాత్కాలికంగా పూడ్చి చేతులు దులుపుకున్నారన్నది ఆందోళనకారుల ఆరోపణ. నెల రోజుల్లో గోతుల్లో పడి నలుగురు గాయపడ్డారని, తక్షణం రహదారిని ఆధునికీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. రవ్వ యాజమాన్యాన్ని అడిగితే ఆర్అండ్‌బీకి నిధులిచ్చామంటున్నారని, ఆర్అండ్‌బీ అధికారులు నిధుల సంగతి తమకు తెలియదంటున్నారని ఆందోళనకారులు అంటున్నారు. అసలు విషయం తేలే వరకు ఓఎన్జీసీ వాహనాలను కదలినిచ్చేదిలేదని స్పష్టం చేశారు. సర్పంచ్ ఇసుకపట్ల జయమణిరఘుబాబు, ఉప సర్పంచ్ చీకురుమెల్లి సత్యనారాయణ, దంగేటి బాబులు, భోగిశెట్టి నర్సింగ్, ఆకుల జోగయ్యనాయుడు, సుంకర చిన్నా తదితరులు ఆందోళనకు నాయకత్వం వహించారు.

నవోదయ అడ్మిట్ కార్డుల విడుదల

పెద్దాపురం, ఫిబ్రవరి 1: జవహర్ నవోదయలో 9, 11 తరగతిలో లేటరల్ ఎంట్రీ ప్రవేశపరీక్ష అడ్మిట్ కార్డులు విడుదలైనట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.కమలం చెప్పారు. 9,11 తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 10న ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు నవోదయ వెబ్‌సైట్ నుంచి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అభ్యర్థులకు పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లో ఆరు కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందన్నారు.

అనుమతులు లేని బంకులు తొలగించాలని ఫిర్యాదు

అంతర్వేది, ఫిబ్రవరి 1: సఖినేటిపల్లి మండలంలో బయో డీజిల్ బంకుల వద్ద అక్రమ డీజిల్ వ్యాపారం జరుగుతుందని, నిఘా ఉంచాలని బంకు యజమానులు గురువారం సఖినేటిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతర్వేది రాంబాగ్, పల్లిపాలెం గ్రామాల్లో బయో డీజిల్ పంపుల వద్ద ఏ విధమైన అనుమతులు లేకుండా అక్రమ డీజిల్ విక్రయాలు జరుగుతున్నాయన్నారు.సఖినేటిపల్లి మండల పెట్రోల్ బంకు డీలర్ల అసోసియేషన్ సభ్యులు మెండు పద్మారావు, బెల్లంకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లోఓల్టేజ్ సమస్యను తీర్చండి

మామిడికుదురు, ఫిబ్రవరి 1: గ్రామాల్లో ఉన్న లోఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలని విశాఖపట్నం నుంచి వచ్చిన డీఈ వైప్రసాద్‌కు మామిడికుదురు సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో స్థానికులు వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలోని సమస్యలను సీఎండీ దృష్టికి ఇటీవల ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు తీసుకువెళ్లడంతో డీఈ ప్రసాద్ మామిడికుదురు వచ్చారు. ముస్లింవీధి కాల్వగట్టు తదితర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను స్థానికుల నుంచి డీఈ అడిగి తెలుసుకున్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

మలికిపురం, ఫిబ్రవరి 1: తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు బదిలీపై కృష్ణా జిల్లా వెళుతున్న సందర్భంగా గురువారం లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు, పీఎస్ రాజు, పి.వేణుగోపాలరావు, తిరుమల చిట్టిబాబు, రాజకుమార్, భాస్కర్, భవానీపాల్గొన్నారు.

బీజేపీ సమావేశం

మలికిపురం, ఫిబ్రవరి 1: పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా విశ్వేశ్వరాయపురంలో గురువారం డి.రామలింగరాజు అధ్యక్షతన బీజేపీ సమావేశం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో 400 సీట్లు గెలుచుకుంటుందన్నారు. కార్యక్రమంలో కట్టా వాసు, మేడిచర్ల శ్రీనివాసరావు, గెద్దాడ సత్యనారాయణ, మాలే శ్రీనివాసనగేష్, అడబాల రాంబాబు, అచ్యుతరామరాజు తదితరులు పాల్గొన్నారు.

నాయకులను కలుస్తున్న బొంతు

మలికిపురం, ఫిబ్రవరి 1: జనసేన నాయకుడు బొంతు రాజేశ్వరరావు అనుచరగణంతో రాజోలు నియోజకవర్గంలోని ప్రముఖులను కలుస్తున్నారు. టీడీపీ ప్రముఖులు, జనసేన నాయకులను కలిసి మద్దతు కోరుతున్నారు. రాజోలు అసెంబ్లీ స్థానాన్ని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రకటించడంతో ఆయన విస్తృత ప్రచారం చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 1: రాజోలంక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల(బాలికల) పాఠశాల, కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.గంగాభవానీ తెలిపారు. 2024-25 ఏడాదిలో ఇంటర్ ఎంపీసీ 40 సీట్లు, బైపీసీ 40 సీట్లు, 6వ తరగతిలో 80సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుందని, అప్లికేషన్లు ఆన్‌లైన్‌లో లేదా దగ్గరలో ఉన్న గురుకుల పాఠశాలను నేరుగా సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఈనెల23 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 5వ తరగతికి ప్రవేశ పరీక్ష మార్చి 10న ఉదయం 10 గంటలకు, ఇంటర్మీడియట్‌కు మధ్యాహ్నం 2గంటలకు పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ గంగాభవానీ తెలిపారు.

రాజోలు: రాజోలు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ టి.లలితకుమారి తెలిపారు. ఫిబ్రవరి 23వరకు ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటలలోపు గురుకుల పాఠశాలలో సంప్రదించాలన్నారు. అలాగే ఫిబ్రవరి 23వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మార్చి 10వతేదీ ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు 5వ తరగతికి, మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30గంటలవరకు ఇంటర్‌కు ప్రవేశపరీక్ష నిర్వహిస్తామన్నారు.

పి.గన్నవరం: నరేంద్రపురం గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పన్నం వేణు తెలిపారు. 5వ తరగతికి 80 సీట్లు, ఇంటర్ ఎంఈసీకి 40, సీఈసీకి-40 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. మార్చిన 10న ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

విద్యార్థి ఆచూకీ లభ్యం

అల్లవరం, ఫిబ్రవరి1:గోడి గురుకుల కళాశాలఇంటర్ విద్యార్థి కోరుకొండ యశ్వంత్‌కుమార్ ఆచూకీ లభ్యమైందని ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. తాను, సిబ్బంది, తల్లిదండ్రులు వెతికి అంబాజీపేట బస్టాండు వద్ద పట్టుకున్నామన్నారు.ఎస్ఐ జి.హరీష్‌కుమార్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.

బీసీలకు న్యాయం చేసేది టీడీపీ మాత్రమే

- టీడీపీ రామచంద్రపురం ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం
- కాట్రేనికోన, మామిడికుదురులో జయహో బీసీ సభ




కాట్రేనికోన: అభివాదం చేస్తున్న టీడీపీ నాయకులు, మామిడికుదురు: మాట్లాడుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

కాట్రేనికోన,ఫిబ్రవరి1: బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం చేసేది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమేనని టీడీపీ రామచంద్రపురం ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. కాట్రేనికోన వ్యాసమూర్తి కళ్యాణ మండపంలో గురువారం గుబ్బల చంద్రరావు అధ్యక్షతన జరిగిన జయహో బీసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ తెలుగుదేశం బడుగు, బలహీనవర్గాల పార్టీ అన్నారు. మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ బీసీలకు టీడీపీ34శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, జగన్ ప్రభుత్వం 10శాతం కోత విధించిందన్నారు. జనసేన పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, పెచ్చెట్టి చంద్రమౌళి, వాడ్రేవు వీరబాబు, పిల్లి నాగరాజు, విత్తనాల వెంకటరమణ, విత్తనాల బుజ్జి, మోకా బాలప్రసాద్, గిడ్డి రత్నశ్రీ, బి.రుక్మిణి, వాసంశెట్టి అమ్మాజీ, మాదే యోగీశ్వరి, పొన్నమండ రామలక్ష్మి, మందాల గంగసూర్యనారాయణ, కర్రి శ్రీనివాస్, రెడ్డి సుధీర్, దండుప్రోలు సత్యం, బాలుయాదవ్, వెంట్రు సుధీర్, జంగా శ్రీనివాసరావు, గుత్తుల సూరిబాబు, చెల్లి సురేష్, జొన్నాడ రాజారావు, సత్తాల ప్రసాద్, గెద్దాడ శ్రీను, బొక్కా చిన్నా, బీమాల సూర్యనాయుడు పాల్గొన్నారు.

నాడు ముద్దులు.. నేడు పిడి గుద్దులు..

మామిడికుదురు, ఫిబ్రవరి 1: అధికారం కోసం నాడు సీఎం జగన్ ముద్దులు పెట్టి, అధికారంలోకి వచ్చాక ప్రజలను పిడి గుద్దులు గుద్దుతున్నారని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ ఎద్దేవా చేశారు. పాశర్లపూడిలో టీడీపీ మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన జయహో బీసీ సదస్సులో వారు మాట్లాడారు. బీసీలంతా కలిసికట్టుగా ఉండి రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి దుర్మార్గపు ముఖ్యమంత్రికి బుద్ధి చెప్పాలన్నారు. ఇంకా పలువురు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం తథ్యమన్నారు. పార్టీలో చేరిన పలువురికి రెడ్డి సుబ్రహ్మణ్యం పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, పెచ్చెట్టి చంద్రమౌళి, వాసంశెట్టి సత్యం, పెండ్ర రమేష్, కుడుపూడి బుజ్జి, దాసరి వీరవెంకటసత్యనారాయణ, పెచ్చెట్టి విజయలక్ష్మి, స్థానిక నాయకులు బోనం బాబు, ఈలి శ్రీనివాస్, మద్దాల కృష్ణమూర్తి, చుట్టుగుళ్ల కిశోర్, జనసేన నేతలు అడబాల తాతకాపు, జాలెం శ్రీనివాసరాజా, వాసంశెట్టి కుమార్, తుందూరి బుజ్జి, వాసంశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

పరిహారం ప్రభుత్వ ఖాతాలో జమచేయాలి

యానాం, ఫిబ్రవరి 1: యానాం మత్స్యకారులకు నష్ట పరిహారాన్ని ఓఎన్జీసీ సంస్థ తక్షణం ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యానానికి ఇచ్చే పరిహారం విషయంలో ఓఎన్జీసీ అధికారులతో ప్రభుత్వ అధికారులు, తాను మూడేళ్లలో 50సార్లుపైగా చర్చించామన్నారు. 37సార్లు ఉత్తరప్రత్యుత్తరాలు చేపట్టామన్నారు. ఏపీలోమొదట పరిహారం ఇచ్చినప్పుడులబ్ధిదారులు 16 వేలు ఉండగా ఇప్పుడు 25వేలుమంది ఉన్నారన్నారు. యానాంలో జాబితాప్రకారం 6,686మంది ఉన్నారని, వీరిలో 5,462మందిని ఎంపిక చేశారని, జాబితి ఇస్తే మూడు రోజుల్లో నగదు వేస్తామని చమురు సంస్థ చెప్పిందని, నివేదిక ఇస్తే ప్రశ్నలు లేవనెత్తి కాలయాపన చేస్తున్నారన్నారు. ఓఎన్జీసీ సంస్థ రూ.23కోట్లు మినహా మిగిలిన నగదు ప్రభుత్వ ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం యానాం ఓఎన్జీసీ సంస్థ వద్ద ధర్నా చేయనున్నట్టు మల్లాడి చెప్పారు.

కేశవరంలో భవిష్యత్‌కు గ్యారంటీ

మండపేట,జనవరి2: ఎన్నికలకు సిద్ధమని అంటున్న సీఎం జగన్ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని, మద్య నిషేదంవిధిస్తామని చెప్పిమాటతప్పారని ఎమ్మెల్యే వేగుళ్ల ప్రశ్నించారు. సీఎం జగన్‌ను సాగనం పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కేశవరంలో బుధవారం జరిగిన బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో వేగుళ్ల ఇంటింటా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు కర్రి తాతారావు, కంటిపూడి శ్రీను, జనసేన,టీడీపీశ్రేణులు వున్నారు.

జనసేనలో పలువురి చేరిక



ముమ్మిడివరం, ఫిబ్రవరి 1: పలువురు మత్స్యకారులు జనసేన పార్టీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఐ.పోలవరం మండలం భైరవపాలెం తీర్ధాలమొండి నుంచి పోతాబత్తుల గోవిందరాజు, ఓలేటి బాబి పోతాబత్తుల వెంకటరత్నం, సంగాడి నరసింహరాజు ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరగా వారికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాట్రేనికోన మండలం పల్లం నుంచి మల్లాడి సతీష్ ఆధ్వర్యంలో పట్టా కాసురాజు, అంగాడి శంకరరాజు, మల్లాడి మహేష్, మల్లాడి ధర్మ, కర్రి వెంకటేష్, మల్లాడి శ్రీనులతో పాటు పలువురు పార్టీలోకి చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. జక్కంశెట్టి బాలకృష్ణ, మద్దింశెట్టి పురుషోత్తం, కడలి వెంకటేశ్వరరావు, దూడల స్వామి, యలమంచిలి బాలరాజు, గుద్దటి విజయ్, పితాని రాజు పాల్గొన్నారు.

దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో కోనసీమ విద్యార్థుల ప్రతిభ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 1: విజయవాడలో జరిగిన దక్షిణ భారత విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో కోనసీమ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ప్రాజెక్టులు టాప్ కేటగిరీలో నిలిచి నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందుకున్నట్టు జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం గురువారం రాత్రి తెలిపారు. వన్నెచింతలపూడి జడ్పీహెచ్ఎస్, నేదునూరు జడ్పీహెచ్ఎస్‌లు టాప్ 5,6లో నిలిచాయి. అమలాపురం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రాజెక్టు ప్రోత్సాహక బహుమతి దక్కించుకుంది. విద్యార్థులను కలెక్టర్ హిమాన్షు శుక్లా, డీఈవో ఎం.కమలకుమారి, సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ మధుసూదన్, డీవైఈవో లక్ష్మీనరసింహపణి, జిల్లా పరీక్షల విభాగం అధికారి నక్కా సురేష్ అభినందించారు.

యానాం ఎస్పీ రఘునాయగం బదిలీ

యానాం, ఫిబ్రవరి 1: యానాం ఎస్పీ ఆర్.రఘునాయగంను పుదుచ్చేరి స్పెషల్ బ్రాంచ్ ఎస్పీగా బదిలీ చేస్తూ పుదుచ్చేరి పోలీసుశాఖ ఉన్నతాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. పుదుచ్చేరి వీపీపీలో పనిచేస్తున్న యు.రాజశేఖర్‌ను యానాం ఎస్పీగా నియమించారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



ఆత్రేయపురం: వద్దిపర్రులో బాండ్లు అందిస్తున్న బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 1: వైసీపీ పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు పేర్కొన్నారు. బాబుష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన వద్దిపర్రులో ఇంటింటికీ వెళ్లి ష్యూరిటీ బాండ్లు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే శిలాఫలకాలపై పేరు కోసం హడావుడిగా శంకుస్థాపనలు చేస్తున్నారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జి ముళ్లపూడి భాస్కరరావు, కరుటూరి భాస్కరరావు, సర్పంచ్ జుజ్జువరపు శ్యామల హరిబాబు, వాకలపూడి సూరిబాబు, తోట రజని, సర్పంచ్ మెర్ల రాము, చిటికెన సత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

కొత్తపేట, ఫిబ్రవరి 1: పలివెల శివారు పూజారిపాలేనికి చెందిన ఐదుగురు దళిత వర్గీయులు వాడపాలెంలో మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వారికి బండారు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కంఠంశెట్టి శ్రీను, చవల జగన్నాథం, సాదే శ్రీనివాస్, పల్లికొండ అర్జునరావు, సాగర్, రాంబాబు పాల్గొన్నారు.

ఇంకొన్ని రోజులు కష్టిస్తే విజయం మనదే

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 1: కొద్ది రోజలు కష్టిస్తే గెలుపు మనదేనని టీడీపీ అమలాపురం అసెంబ్లీ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. భీమనపల్లిలో క్లస్టర్ ఇన్‌చార్జి దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ స్వగృహం వద్ద గురువారం టీడీపీ ఇంటిగ్రేటెడ్ శిక్షణా శిబిరం నిర్వహించారు. 9, 10 క్లస్టర్ల బూత్ కన్వీనర్లు, గ్రామ కమిటీల అధ్యక్షులకు ట్రైనీ బత్తుల గణపతి శిక్షణ ఇచ్చారు. ఈ నెల 5వ తేదీ నాటికి బాబు ష్యూరిటీ..భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నూరు శాతం పూర్తి చేయాలని సూచించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ, క్లస్టర్ ఇన్‌చార్జులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, లంకే భీమరాజు, నాయకులు గొలకోటి చిన్నా, గుత్తుల నాగేశ్వరరావు, పెయ్యల దుర్గారావు, ఆకేటి పెద్ద, మల్లాడి వెంకటరమణ, కంకటాల రామం, సలాది శ్రీనివాసరావు, చీకట్ల ఏసు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి సమష్టి కృషి చేయాలి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 1: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి శ్రేణులు సమష్టిగా పని చేయాలని టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. గురువారం అమలాపురంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు పెచ్చెట్టి విజయలక్ష్మి, మెట్ల రమణబాబు ఆధ్వర్యంలో జరిగిన ఇంటిగ్రేటెడ్ శిక్షణ తరగతుల్లో పార్టీ శ్రేణులకు ఆనందరావు దిశానిర్దేశం చేశారు. నాయకులు తిక్కిరెడ్డి నేతాజీ, కర్రి రామస్వామి, మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ, బొర్రా వెంకటేశ్వరరావు, చిక్కాల రాంబాబు, అబ్బిరెడ్డి చంటి, భాస్కర్ల రామకృష్ణ, కుంచే వెంకన్నబాబు, వలవల శివరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట: టీడీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న బండారు సత్యానందరావు

టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

అల్లవరం, ఫిబ్రవరి 1:రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగాఐక్యతతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కోరారు. కోడూరుపాడులోని పార్టీ కార్యాలయంలో దేవగుప్తం, కొమరగిరిపట్నం గ్రామాలకు చెందిన కార్యకర్తలకు బావన ప్రసాద్, కొప్పిశెట్టి ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. చింతా శ్రీనివాస్, కాకిలేటి సూర్యప్రకాశ్, గోసంగి స్టాలిన్, కొల్లు విష్ణుమూర్తి, వేగిరాజు శ్రీనురాజు, మంతెన సురేష్‌రాజు, అల్లూరి సోమరాజు, గుబ్బల నాగేశ్వరరావు, పోతుల నాగరాజు, నార్గన శ్రీనివాస్, పంపిరెడ్డి కాశీ, తోట నరసింహరావు, యాళ్ళ కాసుబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన: కాట్రేనికోన విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. కాట్రేనికోన టౌన్, వేట్లపాలెం, జీకే పొర, చిర్రయానాం, గెద్దనపల్లి, నడవపల్లి, కుండలేశ్వరం, దొంతికుర్రు కొప్పిగుంట, పండి-పల్లం, కందికుప్ప, పల్లంకుర్రు, బలుసుతిప్ప, మొల్లేటిమొగ గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

కె.గంగవరం: పామర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడం కోసం సరఫరాను నిలిపివేస్తున్నట్లు డీఈ వై.విజయానంద్ తెలిపారు. కూళ్ల, తమ్మయ్యపాలెం, నరజాడ, కోరుమిల్లి, మాచర, వాకతిప్ప గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రామచంద్రపురం: రామచంద్రపురం 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వై.విజయానంద్ తెలిపారు. పట్టణంలో చర్చి మెయిన్‌రోడ్డు, ఎల్ఐసీ నుంచి లారీయూనియన్ ఆఫీస్, కెఎస్ఆర్ నగర్, పసలపూడి రోడ్, వీఎస్ఎం కాలేజీ, చింతపల్లి సూరన్న నగర్, గంగుమల్లవారి వీధి, రామదుర్గా సెంటర్, గణేష్ వాటర్ ప్లాంట్, లెప్రసీ కాలనీ, పసలపూడి రోడ్డు చైతన్య రైస్ మిల్లు వరకు శుక్రవారం ఉదయం9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా ఉండదన్నారు.

కార్యదర్శి చంటికి ఉత్తమసేవా పురస్కారం



కె.గంగవరం, ఫిబ్రవరి 1: కె.గంగవరం గ్రామకార్యదర్శి ముద్రగడ సత్యనారాయణమూర్తి(చంటి) అమలాపురంలో జరిగిన కార్యక్ర మంలో జిల్లా పంచాయతీ అధికారిణి వి.కృష్ణకుమారి నుంచి ఉత్తమ సేవాపురస్కారం అందుకున్నారు. చంటిని ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్, తహసీల్దార్ టి.వైద్యనాథ్‌శర్మ, ఈవోపీఆర్డీ యు.నాగేంద్ర, కార్యదర్శులు కె.వి.వి.సత్యనారాయణ, గౌరీశంకర్, గౌతమి, సీతారామయ్య, సాకా రామకృష్ణ, డి.రామాంజనేయులు, ఎస్.సుబ్బారావు, ఎం.జె.సుందరదాజ్ అభినందనలు తెలిపారు.

జనసేన స్థూపం ఆవిష్కరణ

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 1: జనసేన నాయకుడు లింగోలు పండు ఆధ్వర్యంలో సాకుర్రు గున్నేపల్లిలో గురువారం పార్టీ స్థూపాన్ని పార్లమెంటు ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్ ఆవిష్కరించారు. వైసీపీకి చెందిన 60మంది నాయకులు శేఖర్ సమక్షంలో పార్టీలో చేరగా కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యాళ్ల నాగసతీష్‌నాయకులు అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఆకుల సూర్యనారాయణమూర్తి, పోలిశెట్టి బాబులు, బట్టు పండు, కొప్పుల నాగమానస తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ లోక్‌సభ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

అమలాపురంటౌన్, ఫిబ్రవరి1: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి గురువారం భీమవరం నుంచి వర్చువల్‌గా రాష్ట్రంలోని 25 లోక్‌సభ నియోజకవర్గాల ఎన్నికల కార్యాలయాలను ప్రారంభించారు. బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఆధ్వర్యంలో అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల కార్యాలయంలో పార్టీ పతాకాన్ని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా ఆవిష్కరించారు. సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనకాపల్లి ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, జిల్లా ప్రధాన కార్యదర్శులు మోకా వెంకటసుబ్బారావు, యిళ్ల వెంకటేశ్వరరావు, గనిశెట్టి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, చిట్టూరి రాజేశ్వరి, కొండేటి ఈశ్వర్‌గౌడ్, బీఎస్ మూర్తి, అరిగెల తేజ పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల పరిశోధనలపై రేడియోలో సీరియల్



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 1: పదమూడు మంది శాస్త్రవేత్తల పరిశోధనలను సజీవరీతిలో చిత్రీకరించి రేడియోలో ప్రసారానికి అనువుగా రాసే అవకాశం కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వర శర్మకు దక్కింది. ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం నుంచి ప్రతి ఆదివారం మధ్యాహ్నం 2.30గంటలకు ఈ సీరియల్ ప్రసారమవుతుంది. శర్మను సీబీఐ మాజీ జేడీ వి.లక్ష్మీనారాయణతో పాటు పలువురు అభినందించారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇళ్ల

రామచంద్రపురం, ఫిబ్రవరి 1: రామచంద్రపురానికి చెందిన ఇళ్ల వెంకటేశ్వరరావును బీజేపీ జిల్లాప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, యాళ్ల దొరబాబు, అనకాపల్లి ఇన్‌చార్జ్ కర్రి చిట్టిబాబు, జోనల్ ఇన్‌చార్జ్ కాశీరాజు, అయ్యాజీ వేమాలకు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.1.02కోట్ల అవినీతి ఆరోపణలపై విచారణ

మామిడికుదురు, ఫిబ్రవరి 1: నగరం పంచాయతీలో సంవత్సర కాలంలో కార్యదర్శి తాడి ఏసుబాబు, సర్పంచ్‌లు కలిసి రూ.1.02కోట్ల అవినీతికి పాల్పడ్డారని వార్డు సభ్యుల ఫిర్యాదు మేరకు అమలాపురం డీఎల్‌పీవో పి.బొజ్జిరాజు పంచాయతీలో విచారణ నిర్వహించారు. ఒప్పంద ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లోకి రూ.92లక్షలు మళ్లించినట్టు వార్డుసభ్యులు, ఉపసర్పంచ్ వివరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తానని డీఎల్‌పీవో తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం : ఎంపీపీ గంగాభవానీ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 1: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండల అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని ఎంపీపీ కోలా గంగాభవానీ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జరిగిన వార్షిక బడ్జెట్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టడం జరుగుతుందని ఎంపీపీ అన్నారు. జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మండలాన్ని అభివృద్ధి పథం వైపు తీసుకువెళ్లాలన్నారు.

రూ.23.40కోట్లతో వార్షిక అంచనా బడ్జెట్..

మండల పరిషత్ 2024-25ఏడాదికి వార్షిక అంచనా బడ్జెట్‌ను రూ.23కోట్ల 40లక్షల 13వేలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. బడ్జెట్ అంశాలను సమావేశంలో ప్రవేశపెట్టగా ఆదాయ, వ్యయాలకు సంబంధించిన వివరాలను సమావేశానికి వివరించగా సభ్యులు ఆమోదించారు. బడ్జెట్‌లో వివిధ వ్యయాల కింద రూ.23,39,67వేలు చూపిస్తూ అంత్య నిల్వను రూ.46వేలుగా పేర్కొన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఏఆర్ శ్రీనివాస్, ఎంఈవో బొజ్జా రమణశ్రీ, వైఎస్ ఎంపీపీలు పాము నాగవేణి, మట్టపర్తి సురేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

రాజోలు, ఫిబ్రవరి 1: పల్లెకు పోదాం కార్యక్రమాలు ఈనెల 9,10, 11 తేదీల్లో జరగనున్నాయని, బీజేపీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా కన్వీనర్ చెరుకూరి గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. కూనవరంలో చెల్లింగి త్రినాథరావు స్వగృహం వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు పితాని శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మలికిపురం మండలానికి చెందిన గెద్దాడ సత్యనారాయణను ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యునిగా నియమిస్తూ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చెల్లింగి త్రినాథ్ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అడబాల సత్యనారాయణ, మాలే శ్రీనివాసనగేష్, అడబాల రాంబాబు, యింటిపల్లి రామకృష్ణ, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, దేవళ్ల మాణిక్యాలరావు, గుబ్బల రాంబాబు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌గా రమాదేవి

అంబాజీపేట, ఫిబ్రవరి 1:మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గాబి.రమాదేవి బాధ్యతలుచేపట్టారు. ఇక్కడపనిచేసిన వీరేశ్వరరావు స్వచ్ఛంద ఉద్యోగవిరమణ చేయడంతోఆమె కాకినాడ బీసీకార్పొరేషన్ నుంచి వచ్చారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 1: కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసి పూర్వపు వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పెన్మెత్స జగ్గప్పరాజు పేర్కొన్నారు. ముమ్మిడివరంలో గురువారం నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న దుష్ట పాలనను అంతమొందించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. పార్టీ నాయకులు ఎన్నికల్లో పాటించాల్సిన వ్యూహాలను వివరించారు. కార్యక్రమంలో బత్తుల పండుబాబు, దివి వెంకన్నబాబు, భాస్కరరావు, ధర్మారావు, నాగరాజు, బాలకృష్ణ, రాజాజీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి

మామిడికుదురు, ఫిబ్రవరి 1: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేలా నాయకులు కృషి చేయాలని పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ వంటెద్దు బాబి కోరారు. మామిడికుదురులో కాంగ్రెస్ పార్టీ సమావేశం మండలశాఖ అధ్యక్షుడు అప్పన శ్రీరామకృష్ణ అధ్యక్షతన గురువారం జరిగింది. పార్టీ కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేసి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో చిట్టాల జోగేశ్వరరావు, నెల్లి వెంకటరమణ, మహ్మద్ ఆరిఫ్, మాచవరపు శివన్నారాయణ, ములపర్తి మోహనరావు, గెడ్డం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు ఎంపీడీవోగా వేణుగోపాలరెడ్డి

మామిడికుదురు, ఫిబ్రవరి 1: మామిడికుదురు ఎంపీడీవోగా ఎస్.వేణుగోపాలరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన కె.వెంకటేశ్వరరావు బదిలీపై విశాఖపట్నం జిల్లాకు వెళ్లారు. నూతన ఎంపీడీవోకు ఏవో కె.వెంకటేశ్వరరావు, ఇతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.

పి.గన్నవరం ఎంపీడీవోగా త్రిశూలపాణి

పి.గన్నవరం, ఫిబ్రవరి 1: పి.గన్నవరం ఎంపీడీవోగా సీహెచ్ త్రిశూలపాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎం.భారతీ బదిలీపై కృష్ణజిల్లా పామర్రు మండలం వెళ్లారు. ఎంపీడీవోకు ఏవో శర్మ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించారు.

కొత్తపేట ఎంపీడీవోగా వాణి

కొత్తపేట, ఫిబ్రవరి 1: కొత్తపేట ఎంపీడీవోగా కందుల వాణి బాధ్యతలు స్వీకరించారు. ఈమె పశ్చిమగోదావరి జిల్లా ఆకువీడు నుంచి వచ్చారు.

ఎంపీడీవోగా ఎన్‌వీ రామచంద్రమూర్తి

ద్రాక్షారామ, ఫిబ్రవరి1: రామచంద్రపురం ఎంపీడీవోగా ఎన్‌వి రామచంద్రమూర్తి బాధ్యతలు స్వీకరించారు.అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం నుంచి వచ్చారు. ఇక్కడ పనిచేసిన కీర్తిస్పందన విశాఖజిల్లా పరవాడకు వెళ్లారు.

రాయవరం ఎంపీడీవోగా వెంకటలక్ష్మి

రాయవరం, ఫిబ్రవరి 1: రాయవరం ఎంపీడీవోగా కె.వెంకటలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడపనిచేసిన కొవ్వూరి నరేంద్రరెడ్డి పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీఅయ్యారు.ఉద్యోగులు మర్యాదపూర్వకంగాకలిశారు.

బ్రహ్మానందం పుట్టినరోజు వేడుకలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 1: దుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్ల సంఘం ఆధ్వర్యంలో హాస్యబ్రహ్మ బ్రహ్మానందం పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్‌చేశారు. గున్నేపల్లి భీమశంకరం, పారెళ్ల లక్ష్మణరావు, బట్టేలంక నరసింహారావు, జల్లి సత్యనారాయణ, గుబ్బల వీరాంజనేయులు, ముత్తాబత్తుల శేఖర్, సాకా గిరిబాబు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై ఆర్డీవో సమీక్ష

రామచంద్రపురం, ఫిబ్రవరి 1:ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో ఎస్.సుధాసాగర్ గురువారం సమీక్ష చేశారు. నియోజకవర్గంలో మండలాల వారీగా జనవరి 6 నుంచి 31వరకు ఫారం 6దరఖాస్తులు 775, ఫారం 7దరకాస్తులు 356, ఫారం 8దరకాస్తులు 707 వచ్చినట్లు చెప్పారు. ఈనెల22న ఫైనల్ పబ్లికేషన్‌కు సంబంధించి బూతులు వారీగా జాబితాలో చేర్పులు, మార్పులు, కాపీలను అందజేశారు. వాటర్ జాబితాలు బీఎల్‌వోలు వద్ద ఉన్నాయన్నారు. కొత్తగా ఓట్లు నమోదు చేసుకునే వారు దరకాస్తు చేసుకోవాలన్నారు. కాజులూరు, గంగవరం తహసీల్దార్లు సహాయ ఓటరు నమోదు అధికారులుగా, మున్సిపల్ మేనేజర్, టీడీపీ నుంచి కడియాల రాఘవన్, కాంగ్రెస్ నుంచి కోట శ్రీనివాసరావు, జనసేన నుంచి గొల్లపల్లి కృష్ణ, సత్యవాడ శ్రీహరి పంతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

అల్లవరం, ఫిబ్రవరి 1: మొగళ్ళమూరు-తూర్పులంక మధ్య రూ.1.91కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు, రూ.30లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన గోగివారిపేట సీసీరోడ్డు, తుమ్మలపల్లిలో బీటీ రోడ్డు, కొమరగిరిపట్నంహైస్కూల్లో రూ.84లక్షలతో నిర్మించిన అదనపు భవనాన్ని మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ప్రారంభించారు. తుమ్మలపల్లిలో రూ.35లక్షలు సీఎస్ఆర్ నిధులతో మంచినీటి ఓహెచ్ఎస్ఆర్‌కు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, రుద్రరాజు నానిరాజు, చెల్లుబోయిన శ్రీను, గుంటూరి బాలరాజు, వైస్ ఎంపీపీలు ముత్యాల రామకృష్ణ, వడ్డి గంగ, సర్పంచ్‌లు రాయుడు విష్ణు, రుద్రరాజు పవిత్ర, వడ్డి సుభాషిణి, రాకాపు విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, విద్యాకమిటీ చైర్మన్ పెనుమాల కనకదుర్గభవాని, అల్లూరి సురేష్‌రాజు, ఎంపీడీవో కృష్ణమోహన్, తహసీల్దారు ప్రసాద్, ఏఈ సంపన్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

టీడీపీ పథకాలను ప్రచారం చేయాలి

అంబాజీపేట, ఫిబ్రవరి1: టీడీపీ మేనిఫెస్టోలోని పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు పేర్కొన్నారు. ఇరుసుమండలో టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి చిన్నం బాలవిజయరావు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. పలువురు టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ నాయకుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ జల్లి బాలరాజు, టీడీపీ నాయకులు గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు వక్కలంక బుల్లియ్య, సుంకర గణపతిరావు, దువ్వూరి సురేష్, యడ్లపల్లి తుక్కియ్య, గుమ్మడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటరమణ	: బూట్‌కట్ బాలరాజు
శ్రీలలిత	: ధీర
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరు కారం
గణపతి	: సైంధవ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: హనుమాన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గేమ్ ఆన్